# గుభేల్ అత్తయ్య

ఎన్నో వ్రతాలూ, నోముల ఫలితంగా సంతానం కలిగితే ఇకా తల్లిదండ్రుల సంతోషానికి
పట్టపగ్గాలుండవు. సామ్రాజ్య పట్టాభిషేకం జరిగినంత ఆనందిస్తారు.

ఇక లేక లేక కలిగిన ఆ సంతానాన్ని ఎంత అపురూపంగా చూసుకుంటారో ఆ దేవుడికే తెలియాలి.! చూసిన వాళ్లు అసూయపడేలా ఆ సంతానాన్ని పెంచుకుంటారన్న మాట.

ఇదంతా ఎందుకంటే మొత్తానికి మా మామ్మకి లేక లేక ఒక ఆడ శిశువు పుట్టింది.

ఆ శిశువునకు 'సత్యవతి' అని పేరు పెట్టుకున్నారు. కాలుకదిపితే కందిపోతుందేమో అన్నంత అపురూపంగా పెంచారు. అయితే, ఇవన్నీ నేను ప్రత్యక్షంగా చూసినవి కావు.

మా సత్యవతత్త పెద్దదైన తర్వాత ఆమె చేష్టలతో విసిగిపోయిన మా చుట్టాలు కొందరు పైన జరిగిన విషయాలన్నీ ఏకరవు పెడుతూ, 'ఎంత లేక లేక కలిగిన పిల్లయినా గారం చేస్తే మరి ఇలాగే తయారవుతుందని అక్కసుగా ముచ్చటించుకుంటూటే" విని తెలుసుకున్నవి.

అసలు- మా అత్త మాట్లాడే మాటలు వింటూంటే, ఓ విధమైన మానసిక ఆహ్లాదం కలుగుతుంది!

ఆవిడ చేసిన పనులు తట్టుకోలేక మా సత్యవతత్తకి 'గుభేల్ అత్త' అని పేరు పెట్టుకున్నారట మా చుట్టాల్లోని కొంతమంది ఆరితేరిన గడసరులు!

'మీ ఊరోసారి రావాలని ఉంది! బస్సులు ఎక్కువగా ఉన్నాయా!' అని అడిగితే....

'అబ్బే! మా ఊరు కుగ్రామం. రెండే రెండు బస్సులున్నాయ్! ఒకటి మా ఊరికి మధ్యాహ్నం వచ్చి వెంటనే వెళ్ళిపోతుంది. ఇంకొకటి రాత్రికి వచ్చి ఆ రాత్రి మా ఊళ్లోనే పడుకుని, మర్నాడు పొద్దునే వెళ్ళిపోతుంది' అందిట మా అత్త.

'బస్సులు కూడా రాత్రిళ్లు పడుక్కుంటాయా?' అని ఆశ్చర్యంగా అడిగితే 'అబ్బే! పడుక్కోవడమంటే నైట్ హాల్ట్!' అని విశదపరచారు, పక్కనున్న వాళ్లు.

"ఓహో! పాలు రాత్రి పడుకుని పెరుగైనట్లన్న మాట!' అన్నారట శ్రోతలు.

ఒకసారి నూతి గట్టుమీద 'తిరుగుతున్న పిల్లి పిల్లని గుభేల్ మని, నూతిలో తోసేసిందట మా అత్త.

పెద్ద వాళ్లంతా పిల్లిని చంపితే మహాపాపం అని కంగారు పడుతూంటే గుడికట్టిస్తే

ఆ పాపం పోతుందన్నాడట ఓ పాపారావ్.

అప్పుడా పాపారావ్‌ని నూతిలో తోసేద్దామన్న కోపం వచ్చిందట మా తాత గారికి.

వాళ్లమాటలూ, వీళ్ల మాటలూ తట్టుకోలేక మొత్తానికి ఒకతడ్ని నూతిలో దింపి ఎలాగైతేనేం ఆ పిల్లి పిల్లని పైకి తీయించారట.

అయితే, మా అత్త అదృష్టం కొద్దీ ఆ పిల్లి పిల్ల చావకుండా బతికే ఉందట.

దాన్ని చూసిన ఇరుగుపొరుగు వాళ్లంతా, 'జలగండం తప్పించు కున్నావే తల్లీ!" అన్నారట!

'ఏమిటో! ఈ సత్యవతి పెద్దమనిషైందే కానీ అస్సలు పెద్ద మనిషి తరహాగా ఉండదు! అని చింతాక్రాంతులయ్యారట కొంతమంది!

మరికొందరు అసలు ఆ విషయాన్ని గురించి చింతించి ప్రయోజనమేమిటని చింతించడమే మానేశారట!

పెళ్ళైన తర్వాత మా మావయ్యగారిని, అంటే మా సత్యవతత్త భర్తని నానా బాధలూ పెట్టేదిట.

ఏ పండగైనా ఓ రెండు నెలలకి వస్తుందనగానే, ఈ పండగకి నేను చీర కొనుక్కోను అని మొదలెట్టి, ఇక పండగ, వస్తోందనగా, మావయ్యకి 'ఎడ్వాన్స్ నోటీస్' ఇవ్వకుండా ఓ నాలుగు వేలు తక్కువ కాకుండా ఓ మంచి చీర కొనుక్కుని, ఆ షాపులో పని చేసేవారి వినయ పూర్వక వందనాలు స్వీకరిస్తూ, 'క్వీన్ ఎలిజబెత్‌లా ఆ షాపు మెట్లు దిగుతూ చిరునవ్వుతో రోడ్డుమీదకి వచ్చేదట.

సరే! ఆమె వెనకాలే మా మావయ్యగారు 'నువ్వు పెద్ద గుభేల్‌వే! డబ్బెక్కువ తెచ్చాను కాబట్టి సరిపోయింది. లేకపోతే నన్ను షాపులో కట్టేసేవారు' అనుకుంటూ మా సత్యవతత్త వెనకాలే వెళ్ళేవారు.

ఇలాగే ఓ సంక్రాంతి పండగ ముందు అసలు నేను చీర కొనుక్కోనని మొదలెట్టిన మా అత్త, ఇక సంక్రాంతి రెండ్రోజులందనగా అయిదువేలు పెట్టి పట్టుచీర కొనుక్కుంటానని, మరచిపోయి ఎడ్వాన్స్ నోటీస్ ఇచ్చిందట.

ఈ విషయం బాధపడుతూ ఆఫీసులో పనిచేసే తన అత్యంత సన్నిహితుడైన ఓ స్నేహితునితో మొరపెట్టుకున్నాడట మా మావయ్య.

ఆ మర్నాడు ఆ స్నేహితుడు ఓ భూత వైద్యుడిని మా మావయ్య ఇంటికి పంపాడట!

ఆ భూతవైద్యుడు ఓ ఖాళీ సిమెంట్ బస్తాడు వేపాకులతో సహా వచ్చి, 'పట్టుచీర కావాలా! మామూలుగా రోజూ కట్టుకునేచీర చాలా?' అంటూ, వేపాకు మండలతో మా

అత్తయ్యని అదరకొట్టాడట!

మా అత్తయ్యకి, అనుకోని ఈ సంఘటన ఎదురయ్యే సరికి 'సాదాసీదా చేనేతచీర చాలు!' అని అరిచి నేలపై పడిపోయిందట!

"హా! హా! హా! అంటూ దెబ్బకి వదిలింది, ఆ చీరల దెయ్యం! అవసరమైతే, మళ్ళీ మళ్ళీ వస్తాను" అని ఓ రెడు కొత్త వంద రూపాయల నోట్లు పట్టుకు చక్కాపోయాడట ఆ వైద్యుడు.

చీరలకి భూతవైద్యం వుందని తెలిస్తే ఈ పాటికి ఓ సొంత ఇల్లు కట్టేవాడినని బాధపడ్డాడట మా మావయ్య గారు ఆ తరువాత.

తర్వాత, మా సత్యవతత్త 'చీరల గురించి మారాం' చెయ్యకుండా తనకి ఉన్న మంచి మంచి చీరలు చూసుకుని ఆనందపడేది.

'ఈమధ్య మీ ఆవిడకి ఖరీదైన కొత్త చీరలేమైనా కొన్నావా?' అని మా మవయ్యని చుట్టాలెవరైనా అడిగితే 'ఇంకా కొత్తవెందుకూ, ఆ చీరల బీరువా తీస్తే దాన్నిండా చీరలే. ఆ చీరలు తీస్తున్నప్పుడు అవి దాని మీద పడి ఊపిరి సలపక ఎక్కడ చచ్చిపోతుందేమో నన్నంత భయంగా ఉంటుందినాకు!

అయినా క్రిందటి సంక్రాంతి భోగిపీడతో పాటు నాకు మా ఆవిడకి చీరలు కొనిపెట్టడమనే పీడ కూడా పోయింది!' అని ఓ చిరునవ్వు నవ్వాడు మా మావయ్య. ఓ చుట్టం దగ్గర.

---

ఈ మధ్య చీరల నిమిత్తం ఖర్చులేదన్న ఉక్రోషంతో "మనం కూడా ఓ "నానో" కారు కొనుక్కుందాం" అంది మా సత్యవతత్త.

మా అత్తయ్యతో విసిగిపోయిన మా మావయ్య, కళ్ళు పెద్దవి చేసి కోపంగా, 'నో నో!' అని గదమాయిస్తూ కారు ఎక్కేటప్పుడు కార్లో మొహం ముందుపెట్టాలో కాలు ముందుపెట్టాలో, తెలీదు నీకు! కారు కావాలా?" అని గదమాయించాడు.

"అయితే ఓ కే!" అంది మా అత్త.

---

ఈ మధ్య మా చెల్లెలికి ఓ పెళ్ళి సంబంధం చూశాం.

మా అత్తయ్య నెక్లెస్ మా చెల్లెలి మెడలో అలంకరించి పెళ్ళి చూపులకి కూర్చోబెట్టాం. ఆ కార్యక్రమం అంతా అయ్యేసరికి ఓ రెండు గంటలు పట్టింది.

ఆ కార్యక్రమం పూర్తవకుండానే మధ్యలో తనకి బస్‌వేళ మించి పోతుందని

చెప్పి 'ఇక తను బయల్దేరతాను' అంటూ మా చెల్లెలి మెడలోని నెక్లెస్ తీసుకుని 'నే వస్తా' అంటూ బయల్దేరి వెళ్లిపోయింది మా అత్త.

ఈ విషయం గమనించని ఆ పిల్లాడి తరఫువాళ్లు, ఆ నెక్లెస్ డిజైన్ బాగుందనీ అటువంటిది చేయించుకుంటామని చెప్పి ఆ నెక్లెస్ మరోసారి చూస్తామన్నారు.

అది మా అత్తయ్యదనీ తాను తీసుకుపోయిందనీ సిగ్గుపడుతూ చెప్పాం.

ఇంత మందిలో, ఎవ్వరూ చూడకుండా ఆ నెక్లెస్ పట్టుకుపోయిన పెళ్ళి కూతురు మేనత్త నేర్పరితనానికి ఆశ్చర్యపోతూ మేనత్త పోలికలు ఈ పిల్లకి వస్తే కష్టమని చెప్పి మా సంబంధం వదలుకున్నారు వాళ్లు.

మేమందరం మన సత్యవతత్త పెద్ద 'గుభేల్!' అనుకున్నాం

ఆ తరువాత మా అత్తయ్య ప్రయాణమై వెళ్ళిపోయిన గంటకి ఫోన్ వచ్చింది.

ఆ ఫోన్‌లో మా అత్త ఏడుస్తూ చెప్పింది.

"మీ వద్దనుంచి ఆ నెక్లెస్ తీసుకెళ్లక పోయినా బాగుండేదనీ, బస్సు వెళ్ళిపోతుందన్న హడావిడలో ఆ నెక్లెస్ తన వేనిటీ బ్యాగ్‌లో పెట్టాననీ ఆ విషయం మరచి అజాగ్రత్తగా ఉండటం వలన ఆ నెక్లెస్‌తో సహా వ్యానిటీ బ్యాగ్ పోయిందనీ"

ఈ తర్వాత, మా అత్త తన గుభేల్ వేషాలు పూర్తిగా మానేస్తుందనుకున్నాం.

కానీ, మేమనుకున్నట్లు ఆవిడ గుభేల్ వేషాలు పూర్తిగా మాననేలేదు కానీ, కొంత వరకూ తగ్గించిన మాట మాత్రం వాస్తవం.

పోన్లే ఏదో కొంతవరకూ నయం కదా నని మేమంతా సంతోషించాం.

---

(ఆంధ్రప్రభ దినపత్రిక 10-06-2011)